క్లుప్తంగా

మైనార్టీ 'గురుకులం'లో ప్రవేశాలు

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఏపీ గురుకుల విద్యాలయ సంస్థ ఆధ్వర్యంలో భవానీపురంలో నిర్వహిస్తున్న ఏపీఆర్ఎస్ మైనార్టీ గురుకుల బాలికల పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరానికి ప్రవేశాలు కల్పిస్తున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్.శివకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో 40 సీట్లు, 6, 7, 8 తరగతులలో(బ్యాక్ లాగ్) మిగిలి ఉన్న సీట్ల కోసం అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సీట్ల భర్తీలో ముస్లిం (బీసీ–ఇ, బీసీ–బీ, బీసీ–సీ (కన్వర్టెడ్ క్రిస్టియన్) విద్యార్థినులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 25న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తామని, ఆసక్తిగల విద్యార్థులు ఈనెల 31వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. రాష్ట్రంలో ఏజిల్లాకు చెందిన విద్యార్థి అయినా దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. మరిన్ని వివరాలకు 8712625036 నంబర్‌లో సంప్రదించాలని ప్రిన్సిపాల్ సూచించారు.

స్వామివారికి పంచామృత అభిషేకాలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని చిట్టినగర్‌లోని శ్రీ పద్మావతి గోదాదేవి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామివారికి సోమవారం విశేష పూజలు చేశారు. తెల్లవారుజామున స్వామి వారికి సుప్రభాత సేవ అనంతరం ఆలయ ప్రాంగణంలో ఉత్సవ మూర్తికి పంచామృతాలతో అభిషేకాలు, అర్చన, విశేష అలంకరణ జరిగాయి. ఆలయంలోని మూలవిరాట్‌కు ఆలయ అర్చకులు వినుకొండ రామరత్నాచార్యులు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ఏకాదశిని పురస్కరించుకుని పలువురు భక్తులు, ఉభయదాతలు స్వామివారికి తులసీ దళాలను సమర్పించారు. పూజల అనంతరం పంచహారతుల సేవ నిర్వహించారు.

ఘనంగా ఆలయ వార్షిక వేడుకలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): స్థానిక వీరాంజనేయ స్వామి వారి దేవస్థాన ప్రాంగణంలోని శ్రీకృష్ణ సాయిబాబా మందిర 22వ వార్షిక వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. తెల్లవారుజామున బాబాకు పంచామృతాలు, పసుపు, గంధం, విభూదిలతో అభిషేకాలు, అర్చన, విశేష పూజలు చేశారు. ఆలయ అర్చకులు విన్నకోట శ్రీనివాసరావు శర్మ పర్యవేక్షణలో పూజా కార్యక్రమాలను నిర్వహించగా, ఆలయ ప్రాంగణంలో భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. పెద్దఎత్తున భక్తులు తరలి వచ్చి బాబాగారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ఈఓ వై.సీతారామయ్య, ఆలయ కమిటీ అధ్యక్షులు నందిపాటి నాగవెంకటశ్రీనివాసరావు పర్యవేక్షించగా, అన్నదానానికి సహకరించిన దాతలు అడ్డూరి రామచంద్రరావు, పిల్లా సూరిబాబు, పిల్లా కనకరావులను దేవస్థాన అధికారులు అభినందించారు.

నేడు ఉచితంగా నీటితొట్లు పంపిణీ

భవానీపురం(విజయవాడపశ్చిమ): సంభవ జీవదయ గ్రూప్ చారిటీ వారు భవానీపురం ఐరన్ యార్డ్‌లోని జీవకారుణ్య ఆశ్రమం ద్వారా మంగళవారం ఉదయం 10.30 గంటల నుంచి మంచినీటి తొట్లను పంపిణీ చేయనున్నట్లు ఆశ్రమం నిర్వాహకులు మురాల వెంకటేశ్వర్లు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేసవి కాలంలో మూగజీవుల దాహార్తిని తీర్చాలనుకునే జంతుప్రేమికులకు ఈ తొట్లను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు.

చేతివృత్తుల విభాగం ఏర్పాటుపై హర్షం



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేతివృత్తుల విభాగం రాష్ట్ర అధ్యక్షుడు తోలేటి శ్రీకాంత్‌ను సోమవారం ఆయన కార్యాలయంలో వన్‌టౌన్‌లోని స్వర్ణకార మిత్ర మండలి నేతలు కలిసి ఘనంగా సత్కరించారు. చేతి వృత్తుల విభాగాన్ని ఏర్పాటు చేయడంపై మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈసందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ కూటమి పాలనలో చేతివృత్తుల వారు పనులు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేతి వృత్తుల వారికి అనేక పథకాలను అందించారని వివరించారు. కార్యక్రమంలో వన్‌టౌన్ స్వర్ణకార మిత్రమండలి సభ్యులు చిట్టూరి హరీష్, కర్రి మణికంత, మోదేపల్లి అమర్, రాచబత్తుల కిషోర్, ముంతా కనకాచారి, అందే తిరుమలరావు, బొబ్బిలి బుచ్చిరావు, కొండూరు మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

పాలకులకు పట్టని ప్రజారవాణా

- నగరంలో తగ్గిన సిటీ బస్సుల సంఖ్య
- కొత్త రూట్లకు అవకాశమున్నా పరిశీలన సున్నా
- పట్టించుకోని ఆర్టీసీ అధికారులు
- ఇబ్బందుల్లో పశ్చిమ నియోజకవర్గ ప్రజలు



చిట్టినగర్(విజయవాడపశ్చిమ): నగర జనాభా రోజుకురోజుకు పెరుగుతుండగా, ఆస్థాయిలో ప్రజారవాణా వ్యవస్థ అభివృద్ధికి నోచుకోవడం లేదు. విద్య, ఉద్యోగం, వ్యాపారాల కోసం నగరాల బాటపడుతున్న కుటుంబాల సంఖ్య ఏటా భారీగా పెరుగుతుంటంతో విజయవాడ నగర విస్తీర్ణం ఏటా పెరిగిపోతోంది. దీంతో విజయవాడ చుట్టుపక్కల గ్రామాలు కూడా నగరంలో కలిసి పోయాయి. అయితే నగర విస్తీర్ణం, జనాభా పెరిగినంత వేగంగా రవాణా వ్యవస్థ అభివృద్ధి చెందకపోవడంతో ప్రజలకు ఇక్కట్లు తప్పడం లేదు. ముఖ్యంగా విజయవాడ సిటీ నుంచి పేద, మధ్య తరగతి ప్రజలు నివాసం ఉండే ప్రాంతాలకు ఆర్టీసీ సిటీ బస్సు సర్వీసులు పెరగడం లేదు. గతంలో ఉన్న సిటీ బస్సు సర్వీసులలో అనేక సర్వీసులు పూర్తిగా రద్దుకాగా, మరికొన్ని సర్వీసుల బస్సు సంఖ్యను తగ్గించేశారు. దీంతో ఆయా ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ప్రజలు ఆటోలను ఆశ్రయించాల్సిన పరిస్థితి నెలకొంది.

ప్రజారవాణా వ్యవస్థ నిర్వీర్యం..

విజయవాడ నగరవాసులకు మెరుగైన రవాణా వ్యవస్థను అందుబాటులోకి తీసుకురావాల్సిన రాష్ట్రప్రభుత్వం ఆదిశగా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. ఆర్టీసీ బస్సు సర్వీసుల సంఖ్యను తగ్గించేస్తుండటంతో నగరవాసులకు ఆటోలే దిక్కుగా మారుతున్నాయి. దీంతో భారమైనప్పటికీ తమ కుటుంబ అవసరాల కోసం ప్రజలు వాయిదాల పద్ధతిలో ద్విచక్రవాహనాలను కొనుగోలు చేస్తున్నారు. ముఖ్యంగా పేదవర్గాలు అత్యధికంగా నివసించే పశ్చిమ నియోజకవర్గంలోని కీలక ప్రాంతాల నుంచి నగరంలోని పలు వ్యాపార, వాణిజ్య రంగాలు విస్తరించి ఉన్న ప్రాంతాలకు గతంలో బస్సు సర్వీసులను ఆర్టీసీ నడిపేది. గతంలో రికార్డు స్థాయిలో పశ్చిమంలోని అనేక ప్రాంతాల నుంచి నడిచిన బస్సు సర్వీసుల సంఖ్య ప్రస్తుతం పూర్తిగా తగ్గిపోయింది.

పశ్చిమం నుంచి నగర నలుదిక్కులా...!

పశ్చిమ నియోజకవర్గంలోని పాలప్రాజెక్టు నుంచి ఆటోనగర్ వరకు బందరు రోడ్డు మీదుగా 31వ నంబరు బస్సు సర్వీసు, , ఏలూరు రోడ్డు మీదగా 11, 29నంబర్ సర్వీసులు, పాలప్రాజెక్టు నుంచి సింగ్‌నగర్‌కు 16వ నంబర్, నున్న సెంటర్‌కు నాలుగో నంబరు బస్సులు నడిచేవి.

ఇక చిట్టినగర్ సెంటర్ సత్యనారాయణపురం గవర్నమెంట్ ప్రెస్, పైపుల రోడ్డు వరకు 3వ నంబర్ బస్సు సర్వీసులు అధిక మొత్తంలో నడిచేవి. ప్రతి 5నిమిషాలకు ఒక బస్సు చిట్టినగర్ సెంటర్ నుంచి వెళ్లేందంటే ప్రయాణికుల తాకిడి ఏవిధంగా ఉండేదో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. కబేళా సెంటర్ నుంచి ఆటోనగర్ వరకు 5వ నంబర్ సర్వీసు గురించి నగర ప్రజలకు కొత్తగా చెప్పాల్సిన పనిలేదు. వన్‌టౌన్ ప్రాంతానికి చెందినవారు బీసెంట్‌రోడ్డు, మధు కళ్యాణ మండపం, సిద్దార్థ కాలేజీ, రమేష్ హాస్పటల్ వైపు వెళ్లాలంటే 5వ నంబర్ బస్సు కోసం ఎదురు చూడాల్సిందే. ఇక వీటితోపాటు 28ఈ, బీ బస్సులు పశ్చిమ నియోజకవర్గంలోని ప్రతి విద్యార్థికి సుపరిచితం.28ఈ బస్సు పంజా సెంటర్ నుంచి ఏలూరురోడ్డు మీదుగా, కొత్త గవర్నమెంట్ ఆసుపత్రి అక్కడి నుంచి బెంజ్ సర్కిల్, బందరు రోడ్డు మీదుగా పంజా సెంటర్ చేరేది. ఇక 28బీ బందరు రోడ్డు మీదుగా కొత్త గవర్నమెంట్ ఆసుపత్రి, అక్కడి నుంచి ఏలూరు రోడ్డు మీదగా మార్కెట్, పంజాసెంటర్‌కు చేరుకునేది. ఈ బస్సు సర్వీసు ప్రయాణంలో పేదల పాలిట వరంలా ఉండేది. వన్‌టౌన్ ప్రాంతానికి చెందిన వారెవరైనా కొత్త గవర్నమెంట్ ఆసుపత్రిలో ఉన్నారంటే పంజాసెంటర్ వరకు వచ్చి ఈ బస్సు ఎక్కేవారు.. ఆర్టీసీ అధికారులు ఈ బస్సు సర్వీసుల్లో కొన్నింటిని పూర్తిగా తొలగించారు. మరి కొన్ని సర్వీసులకు బస్సుల సంఖ్య తగ్గిస్తూ వస్తున్నారు. ప్రజలకు ఎంతో ప్రయోజనకరంగా ఉన్న బస్సుల సంఖ్యను తగ్గిస్తుండటంపై ప్రజల నుంచి తీవ్రస్థాయిలో విమర్శలు వినిపిస్తున్నాయి. మరో వైపున కాశేశ్వరరావు మార్కెట్ నుంచి నగర శివారు ప్రాంతాలకు నడుపుతున్న అనేక బస్సు సర్వీసులు కూడా కాలక్రమేణా కనుమరుగవుతున్నాయి.

కలగానే బస్సు సౌకర్యం..

పశ్చిమ నియోజకవర్గంలోని పాత రాజరాజేశ్వరిపేట వాసులకు బస్సు సర్వీసును కల్పించాలని ఆ ప్రాంత వాసులు ఎప్పటి నుంచో డిమాండ్ చేస్తున్నారు. సుమారు 20 వేల కుటుంబాలు నివాసం ఉండే పాత రాజరాజేశ్వరిపేట, కంసాలిపేటకు బస్సు సర్వీసు కోసం ట్రయిల్‌రన్ సైతం నిర్వహించారు. కూలీ పనులు, చిరు ఉద్యోగులు అత్యధికంగా ఉన్న పాత రాజరాజేశ్వరిపేటకు సిటీ బస్సు సదుపాయం ఏళ్లతరబడి కలగానే మిగిలింది. మరోవైపున చిట్టినగర్ సెంటర్ నుంచి ఎర్రకట్ట, కేదారేశ్వరపేట, బీఆర్టీఎస్‌రోడ్డు, గుణదల మీదగా ప్రభుత్వాసుపత్రికి బస్సు సర్వీసు ఏర్పాటు చేయాలని ప్రయాణికులు డిమాండ్ చేస్తున్నారు. అయితే ఆర్టీసీ అధికారులు, ప్రజాప్రతినిధులు ఆ దిశగా ఆలోచన చేసింది లేదు. ఇకనైనా పాలకులు, ఆర్టీసీ అధికారులు స్పందించి పశ్చిమ నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాలకు సిటీబస్సు సర్వీసు కల్పించడంతోపాటు బస్సుల సంఖ్యను మరింత పెంచాలని ప్రజలు కోరుతున్నారు.

ముగిసిన వర్క్‌షాపు



విద్యార్థులు తయారు చేసిన నమూనాలను పరిశీలిస్తున్న నిపుణులు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): నూతన సాంకేతిక పరిజ్ఞానం సామాజిక వికాసానికి తోడ్పడాలని పొట్టిశ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కార్యదర్శి చిట్టా అమర్‌సుధీర్ అన్నారు. కళాశాల ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో 'డిజైన్ థింకింగ్ అండ్ ఇన్నోవేషన్' అంశంపై వారం రోజుల పాటు జరిగిన వర్క్‌షాప్ సోమవారం ముగిసింది. ఈ సందర్భంగా విద్యార్థులు తయారు చేసిన వివిధ నమూనాలతో ప్రదర్శనను నిర్వహించారు. ఈసందర్భంగా చిట్టా అమర్‌సుధీర్ మాట్లాడుతూ విద్యార్థులు తమ తమ రంగాలకు సంబంధించిన సాంకేతిక విజ్ఞానాన్ని తెలుసుకోవడంతోపాటు దానిపై పట్టు సాధించాలన్నారు. తద్వారా నూతన ఆవిష్కరణలకు కృషి చేయాలని సూచించారు. విభాగాధిపతి డాక్టర్ ఎం రంగారావు మాట్లాడుతూ రైతులకు ఉపయోగపడే వివిధ సాంకేతిక నమూనాలను విద్యార్థులు తయారు చేశారన్నారు. టెలికమ్యూనికేషన్ శాఖ వైర్‌లెస్ ప్లానింగ్ కమిషనర్ ఆఫీసర్ పద్మజా దివాకర్ మాట్లాడుతూ విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు వినూత్నంగా ఉన్నాయంటూ అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రెసిడెంట్ పొట్టి సురేంద్రకుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్ శరవణకుమార్, కన్వీనర్ ఎస్కే మహ్మద్‌సుభానీ తదితరులు పాల్గొన్నారు.

'యువత పోరు'ను విజయవంతం చేయాలి



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మేయర్ భాగ్యలక్ష్మి, కార్పొరేటర్లు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కూటమి పాలనలో యువతకు జరుగుతున్న అన్యాయాలను ఎత్తి చూపుతూ ఈనెల 12వ తేదీన వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న యువత పోరును విజయవంతం చేయాలని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ పశ్చిమ నియోజకవర్గ కార్యాలయంలో పలువురు కార్పొరేటర్లతో కలిసి సోమవారం ఆమె యువత పోరు పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీలు ఇచ్చి ఏ ఒక్క హామీలను ఇప్పటివరకు అమలు చేయలేదన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో పేదల కోసం అనేక సంక్షేమ పథకాలను తేదీ ప్రకటించి మరీ అమలుచేసిన వైనాన్ని గుర్తుచేశారు. సీఎం చంద్రబాబు గతంలో నిర్వహించిన సభల్లో 'మూలాన కూర్చున్న ముసలమ్మ, మంచంలో ఉండే తాత కూడా బాటన్ నొక్కగలరన్నారని వ్యాఖ్యానించారని.. మరి నేడు ఆయన ఎందుకు బటన్ నొక్కలేకపోతున్నాడో చెప్పాలని' డిమాండ్ చేశారు. చంద్రబాబు తన 40 ఏళ్ల సినీయార్టీతో ప్రజలను మోసం చేస్తున్నారని దుయ్యబట్టారు. నాలుగు సార్లు ముఖ్యమంత్రి అన్ని చెప్పుకున్న వ్యక్తి, ఎన్నికల ముందు ఇన్ని హామీలు అమలు చేయగలమమో, చేయలేమో తెలియకుండా ఎలా ఇచ్చారని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. కూటమి ప్రభుత్వం ఫీజ్ రీయింబర్స్‌మెంట్ చెల్లించకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులెదుర్కొంటున్నారు. యువత, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 12వ తేద ఉదయం 9గంటలకు కలెక్టర్ కార్యాలయం వద్ద యువత పోరు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో నాయకులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కనకదుర్గ ఆలయ మాజీ చైర్మన్ కర్నాటి రాంబాబు, పశ్చిమ కార్పొరేటర్లు మండెపూడి ఛటర్జీ, యరడ్ల ఆంజనేయరెడ్డి, షేక్ ఇర్ఫాన్, పడిగపాటి చైతన్యరెడ్డి, బాపతి కోటిరెడ్డి, గోదావరి గంగబాబు, శిరంశెట్టి పూర్ణచంద్రరావు, నాయకులు షేక్ హయత్‌షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలపై రూ.16వేల కోట్ల భారం : సీపీఎం



50వ డివిజన్‌లో స్థానికులతో మాట్లాడుతున్న సీహెచ్ బాబురావు

వించిపేట(విజయవాడపశ్చిమ): ఇప్పటికే పెంచిన విద్యుత్ చార్జీలతో ప్రజలు అల్లాడుతుంటే..తమ ప్రభుత్వం విద్యుత్ చార్జీలను పెంచలేదంటూ అసెంబ్లీ సాక్షిగా విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పచ్చి అబద్ధాలు చెప్పడం సిగ్గుచేటని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ బాబురావు ఆగ్రహం వ్యక్తంచేశారు. సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 50వ డివిజన్‌లో నిర్వహించిన 'ప్రజాచైతన్య యాత్ర'లో స్థానిక కార్పొరేటర్ బోయి సత్యబాబుతో కలసి ఆయన పాల్గొన్నారు. స్థానికుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఎన్నో మోసపూరిత హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చిన తరువాత హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తున్నారని విమర్శించారు. రాష్ట్ర ప్రజలపై రూ. 16వేల కోట్లు విద్యుత్ భారాలు మోపిందన్నారు. డ్వాక్రా, కాంట్రాక్ట్ కార్మికులకు ఉచిత గ్యాస్ సిలెండర్ పథకం అమలు చేయాలన్నారు. రాబోయే రోజుల్లో పెంచిన విద్యుత్ చార్జీలను రద్దు చేసి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాన్ని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజలతో కలసి ఉద్యమిస్తామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు కే.సూరిబాబు, సిహెచ్ దుర్గారావు, ఎన్.గురప్ప, షేక్ సలీం, సిహెచ్ సత్యారావు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిత్వ వికాసంపై అవగాహన



మాట్లాడుతున్న తూనికుంట్ల శ్రీనివాస్

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ):యువత వ్యక్తిత్వ వికాసంపై అవగాహన పెంచుకోవాలని కేబీఎన్ కళాశాల కార్యదర్శి తూనికుంట్ల శ్రీనివాస్ సూచించారు. కొత్తపేట హిందూ హైస్కూల్, ఎంఎస్ఆర్ హైస్కూల్ ప్రాంగణాల్లో సోమవారం వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా తూనికుంట్ల శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని సూచించారు. హిందూ హైస్కూల్స్ కమిటీ కోశాధికారి గోళ్ళ బాబావిజయకుమార్, కమిటీ అడ్మినిస్ట్రేటివ్ అధికారి డాక్టర్ వీ నారాయణరావు మాట్లాడుతూ ఇటీవల విడుదలైన జేఈఈ మెయిన్స్ పరీక్ష ఫలితాలలో తమ కళాశాల విద్యార్థి రాష్ట్రస్థాయిలో ప్రథమం, దేశస్థాయిలో 13వ ర్యాంకు సాధించడం గర్వకారణమని పేర్కొన్నార. కార్యక్రమంలో హిందూహైస్కూల్ ప్రధానోపాధ్యాయులు కే శ్రీనివాసరావు, ఎమ్మెస్సార్ స్కూల్ ప్రధానోపాధ్యాయిని పి.శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఆయుర్వేద పరిశోధన సంస్థ ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమాలు

పాయకాపురం(విజయవాడరూరల్): ప్రాంతీయ ఆయుర్వేద పరిశోధన సంస్థ ప్రజారోగ్య సంరక్షణ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 11, 12 తేదీల్లో పరిశోధకులకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. విజయవాడలోని ఐలాపురం కన్వెన్షన్ సెంటర్‌లో శిక్షణ కార్యక్రమాలు జరుగుతాయన్నారు. దేశంలోని ఎంపిక చేసిన రాష్ట్రాలలో వివిధ జాతులు, తెగలు, జన సమూహాలలో ఆహార అలవాట్ల సమాచార సంగ్రహణ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని చెప్పారు. ఈ ప్రత్యేక శిక్షణ కార్యక్రమాల్లో డాక్టర్ నారాయణం శ్రీకాంత్, డెప్యూటీ డైరెక్టర్ జనరల్, దేశంలోని కేంద్రీయ ఆయుర్వేద విజ్ఞాన పరిశోధనా సంస్థకు చెందిన పరిశోధకులు, ఆయుర్వేద నిపుణులు, శాస్త్రవేత్తలు హాజరవుతారన్నారు. ప్రజారోగ్య పరిరక్షణలో ఆయుర్వేద ప్రాముఖ్యతను మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లడం ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని చెప్పారు.

పోలీస్ ప్రజావాణిలో 135 ఫిర్యాదులు



విజయవాడస్పోర్ట్స్: విజయవాడలోని పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక(ప్రజావాణి)లో ప్రజల నుంచి 135 ఫిర్యాదులను స్వీకరించినట్లు డెప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్(డీసీపీ) ఏబీటీఎస్ ఉదయరాణి తెలిపారు. ఆర్థిక వివాదాలు 30, కుటుంబ కలహాలు 25, ఆస్తి వివాదాలు 22, మహిళా సంబంధిత నేరాలు 18, మోసాలు 13, చోరీలు, కొట్లాటలు 9, ఇతర ఘటనలు 18 మంది నుంచి అర్జీలను తీసుకున్నామన్నారు. ఫిర్యాదులను నిర్ణీత కాలవ్యవధిలో పరిష్కరించాలని సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను డీసీపీ ఆదేశించారు.

మహిళను మోసం చేసిన వ్యక్తిపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రియల్ ఎస్టేట్ పేరుతో మహిళను మోసం చేసిన వ్యక్తిపై భవానిపురం పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు భవానిపురానికి చెందిన శ్యామల కోటేశ్వరి. బాపట్ల జిల్లా అద్దంకి, కుర్రవానిపాలెం ప్రాంతానికి చెందిన కాకాని రాధాకృష్ణమూర్తి పరిచయస్తులు. రాధాకృష్ణమూర్తి మోదేపల్లి గ్రామంలో ఉన్న సర్వే నెం: 300/2 , 299/3లలో 9ఎకరాల స్థలం కొనుగోలు చేయబోతున్నానని, స్థలం కొనుగోలు చేయడానికి ఆర్థిక సహాయం చేయమని కోరాడు. ఆర్థిక సహాయం చేస్తే స్థలాన్ని అభివృద్ధి చేసి ప్లాట్లుగా విభజించి తనపేర రిజిస్ట్రేషన్ చేస్తానని నమ్మబలికాడు. రాధాకృష్ణ మూర్తి భవానీపురంలో ఉన్న కోటేశ్వరి నివాసానికి వచ్చి పలు దఫాలుగా డబ్బులు అడగగా రూ.36 లక్షలు పెట్టుబడి పెట్టింది. స్థలం మార్కెటింగ్ పేరుతో మరో రూ. 8లక్షలు ఇచ్చారు. కొద్దిరోజుల తర్వాత అద్దంకి వెళ్లి ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయమని కోరగా ఇచ్చేదేమిలేదంటూ అసభ్య పదజాలంతో దూషించాడు. ఆమెపై దాడి చేశాడు. పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పగా తనకు రెండు వారాలు గడువు ఇవ్వమని కోరాడు. గడువు తర్వాత అతను ఫోన్‌ఎత్తక పోవడంతో తాను మోసపోయానని తెలుసుకున్న కోటేశ్వరి ఈ మేరకు రాధాకృష్ణమూర్తిపై భవానిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆకట్టుకున్న ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న న్యాయనిర్ణేతలు

సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): స్థానిక సత్యనారాయణపురంలోని సెయింట్ జాన్స్ స్కూల్‌లో సోమవారం నిర్వహించిన చిన్నారుల ఫ్యాన్సీ డ్రస్ కాంపిటీషన్ చూపరులను విశేషంగా ఆకట్టుకుంది. జాతీయ నాయకులు, శంభాజీ మహారాజు, చార్లీ చాప్లిన్, తెనాలి రామకృష్ణుడు, జై జవాన్, జై కిసాన్, ప్లాస్టిక్ భూతం తదితర వేషధారణలతో అందరినీ ఆకట్టుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా ప్రముఖ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ చాగంటి అనిత, డాక్టర్ పి.జోత్స్నకృష్ణవేణి వ్యవహరించారు. విజేతలకు బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో విద్యాసంస్థల ప్రెసిడెంట్ టి.మోనిక సుమన్ , స్కూల్ సెక్రటరీ డాక్టర్ సుమన్ త్యాగరాజు, ప్రిన్సిపాల్ పావనదీప్తి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అక్రమ వసూళ్లపై కమిషనర్‌కు వినతి



కమిషనర్ ధ్యాన్‌చంద్రకు వినతిపత్రం ఇస్తున్న రెహమతున్నీసా, హయాత్ షరీఫ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురం 38వ డివిజన్ పరిధిలోని బొడ్డురాయి బొమ్మ సెంటర్, కనకదుర్గ ఫ్లైఓవర్ కింద ప్రాంతాల్లో అనధికారికంగా వసూళ్లు చేస్తున్న పార్కింగ్ ఫీజులను నిలుపుదల చేయాలని స్థానిక వైఎస్సార్ సీపీ కార్పొరేటర్ షేక్ రెహమతున్నీసా, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకులు షేక్ హయాత్ షరీఫ్ కోరారు. డివిజన్‌లోని పలు సమస్యలపై వారు సోమవారం నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్రకు కలసి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. అమ్మవారి దర్శనానికి ఇతర ప్రాంతాల నుంచి కార్లపై వచ్చే భక్తుల వాహనాల పార్కింగ్ విషయంలో కొందరు ప్రైవేట్ వ్యక్తులు అనధికారికంగా తమ ఇష్టారీతిన ఫీజు వసూలు చేస్తున్న వైనాన్ని తమ దృష్టికి తీసుకువచ్చారని తెలిపారు. డివిజన్ పరిధిలో తాగునీటి ఎద్దడితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గతంలోకంటే తక్కువ సమయం నీటిని సరఫరా చేస్తుండటమే అందుకు కారణమని కమిషనర్ దృష్టికి తెచ్చారు. డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరచాలని, పున్నమి హోటల్ పక్కన ఇరిగేషన్ స్థలంలో నిర్మిస్తున్న అనధికార శాశ్వత కట్టడాలను తొలగించాలని, విద్యాధరపురం కుమ్మరిపాలెం సెంటర్‌లోని ఆయుర్వేద హాస్పిటల్, వ్యాయామశాలకు నూతన భవనాలను నిర్మించాలని కోరారు. ఆయా సమస్యల పరిష్కారంపై కమిషనర్ ధ్యాన్‌చంద్ర సానుకూలంగా స్పందించినట్లు వారు వివరించారు.

సావిత్రీబాయి కృషి శ్లాఘనీయం



సావిత్రీబాయి పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న శేషగిరిరావు తదితరులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): బాలికా విద్య కోసం సంఘ సంస్కర్త సావిత్రీబాయి పూలే చేసిన కృషి శ్లాఘనీయమని ఏపీ పీటీడీ బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఎస్వీ శేషగిరిరావు అన్నారు. సంఘ సంస్కర్త సావిత్రిబాయి పూలే వర్ధంతి సందర్భంగా భవానీపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో సోమవారం ఆమె చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలు అభివృద్ధి చెందాలంటే ఆధునిక విద్య ద్వారానే సాధ్యమని గుర్తించి, ఆదిశగా సావిత్రీబాయి కృషిచేశారంటూ ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో బీసీ నాయకులు మాదాల తిరుపతిరావు, రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షులు బావనపల్లి ఆంంజనేయులు, డీ అంకినీడు, రజక సంఘం అధ్యక్షులు జీ వెంకటరామయ్య, ఎం మోజస్, పోతుల రాంబాబు, టీ పూర్ణయ్య, పీ వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నగరాన్ని అభివృద్ధి పథంలో పయనింప చేస్తాం

మేయర్ రాయన భాగ్యలక్ష్మి



సమావేశంలో మేయర్ భాగ్యలక్ష్మి, సభ్యులు, అధికారులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): నగరాన్ని మరింత అభివృద్ధి దిశలో పయనింపచేసి ప్రజలకు అవసరమైన మౌలికవసతులను కల్పిస్తామని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు. నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సోమవారం నిర్వహించిన స్థాయి సంఘ సాధారణ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. సమావేశం అజెండాలోని మొత్తం 58 అంశాలపై చర్చించి 46 అంశాలను ఆమోదించారు. అలాగే 7అంశాలను వాయిదా వేయగా , రెండు ర్యాటిఫై, ఒకటి ధృవీకరణ, మరొకటి రద్దు, ఇంకొకటి రికార్డ్ చేయబడ్డాయి. ఈసందర్భంగా మేయర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ అధికారులతో సమన్వయం చేసుకుని, ప్రజల భాగస్వామ్యంతో నగరాన్ని అన్ని విధాల అభివృద్ధి చేస్తామని స్పష్టం చేశారు. నగరంలోని సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో స్థాయి సంఘ కమిటీ సభ్యులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.